క్లుప్తంగా

వైఎస్సార్ సీపీలో చేరిన గాండ్ల తెలికుల సంఘం నేతలు



పార్టీలో చేరిన వారికి కండువాలు వేస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి

జగ్గంపేట: కాకినాడ జిల్లాకు చెందిన సుమారు 10 మంది గాండ్ల తెలికుల సంఘం నేతలు విశాఖ జిల్లా పాయికరావుపేటలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. జగ్గంపేట మండలం జె.కొత్తూరుకు చెందిన రాష్ట్ర బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ ఉయ్యూరి నాని, బుర్ర కాశీ ఆధ్వర్యంలో పార్టీలో చేరిన వారికి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. వచ్చే ఎన్నికల్లో పార్టీ విజయానికి కృషి చేయాలని సూచించారు.

రేపు జగ్గంపేటలో 'తోట' నామినేషన్

జగ్గంపేట: వైఎస్సార్ సీపీ జగ్గంపేట ఎమ్మెల్యే అభ్యర్థిగా తోట నరసింహం మంగళవారం జగ్గంపేటలో నామినేషన్ వేస్తారని ఆ పార్టీ నియోజకవర్గ ఎన్నికల సమన్వయకర్త అత్తులూరి సాయిబాబు ఆదివారం తెలిపారు. ఆ రోజు మధ్యాహ్నం 1 గంట ప్రాంతంలో నామినేషన్ వేస్తారన్నారు. నియోజకవర్గానికి చెందిన పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

మంత్రి రాజాను కలసిన రఘురాం



తునిలో మంత్రి రాజాను శాలువాతో సత్కరిస్తున్న ఒమ్మి రఘురాం

తుని: వైఎస్సార్ సీపీ తుని నియోజకవర్గ పరిశీలకుడిగా నియమితులైన ఒమ్మి రఘురాం ఆదివారం మంత్రి దాడిశెట్టి రాజాను మర్యాదపూర్వకంగా కలిశారు. తుని నియోజకవర్గంలో రాజకీయ పరిస్థితులపై సమీక్ష నిర్వహించారు. నియోజకవర్గంలో ఎన్నికల ప్రచారం వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ నెల 24న ఉదయం 10 గంటలకు నామినేషన్ వేస్తున్నట్లు మంత్రి రాజా ఆయనకు వివరించారు. దాడిశెట్టి రాజా మంచి నాయకుడని, ఆయన వచ్చే ఎన్నికల్లో ఘన విజయం సాధించాలని రఘురాం ఆకాంక్షించారు. నియోజకవర్గంలోని పార్టీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు మరో 21 రోజుల పాటు శక్తి వంచన లేకుండా కష్ట పడాలని సూచించారు. అనంతరం మంత్రి రాజాను నియోజకవర్గ పరిశీలకుడు రఘురాం శాలువాతో సత్కరించారు.

సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి

జిల్లా ఎస్పీ సతీష్ కుమార్



జెడ్.రాగంపేటలో స్థానికులకు సూచనలిస్తున్న ఎస్పీ సతీష్ కుమార్

గండేపల్లి: సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించినట్టు కాకినాడ జిల్లా ఎస్పీ ఎస్.సతీష్‌కుమార్ తెలిపారు. మండలంలోని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను ఆదివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే సార్వత్రిక ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు ప్రజలు సహకరించాలన్నారు. ఎన్నికల సమయంలో కేసులు నమోదైతే తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. ప్రజలు స్వేచ్ఛగా తమ ఓటుహక్కును వినియోగించుకోవాలని సూచించారు. ఆయన వెంట జిల్లా ఏఆర్ అడిషనల్ ఎస్పీ సత్యనారాయణ, పెద్దాపురం డీఎస్పీ కె.లతాకుమారి, జగ్గంపేట సీఐ ఎస్.లక్ష్మణరావు, గండేపల్లి ఎస్సై ఎన్.రామకృష్ణ, సిబ్బంది ఉన్నారు.

నేడు చంద్రబాబు సభ

గోకవరం: టీడీపీ అధినేత చంద్రబాబు సోమవారం జగ్గంపేటలో ప్రజాగళం సభ నిర్వహిస్తున్నారు. మధ్యాహ్నం రెండు గంటలకు ప్రత్యేక హెలికాప్టర్‌లో వచ్చి, 2.30 గంటలకు సభలో పాల్గొంటారని ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి జ్యోతుల నెహ్రూ తెలిపారు.

వైఎస్సార్ సీపీలో భారీగా చేరికలు



వైఎస్సార్ సీపీలో చేరిన ముస్లిం నాయకులు, కార్యకర్తలతో మంత్రి రాజా

కండువాలు వేసి ఆహ్వానించిన మంత్రి రాజా

తుని: ప్రభుత్వం పేదల కోసం అందిస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై ఇతర పార్టీల నాయకులు, కార్యకర్తలు వైఎస్సార్ సీపీలో చేరుతున్నారని రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజా అన్నారు. ఎస్.అన్నవరంలోని క్యాంపు కార్యాలయంలో ఆదివారం సాయంత్రం తుని మండలం తాళ్లూరుకు చెందిన షేక్ మెహబూబ్ సుభానీ (చోటు) ఆధ్వర్యంలో టీడీపీ, జనసేన పార్టీలకు చెందిన షేక్ ఖాదర్ వల్లీ, షేక్ భువాని మున్నా, రంజాన్ వల్లీ, నజీర్, సుభానీతో పాటు 50 మంది వైఎస్సార్ సీపీలో చేరారు. వీరికి మంత్రి దాడిశెట్టి రాజా కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన దక్షత, మంత్రి రాజా నాయకత్వ లక్షణాలకు ఆకర్షితులై వైఎస్సార్ సీపీలో చేరామని వారు తెలిపారు. వచ్చే ఎన్నికల్లో రాజా విజయం కోసం పని చేస్తామన్నారు. పార్టీ కోసం కష్టపడి పని చేసే నాయకులు, కార్యకర్తలకు సముచిత స్థానం కల్పిస్తామని రాజా భరోసా ఇచ్చారు.



టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలో చేరిన నాయకులతో మంత్రి దాడిశెట్టి రాజా

టీడీపీని వీడి వైఎస్సార్ సీపీలోకి...

తుని: మండలంలోని టి.వెంకటాపురం గ్రామానికి చెందిన పలువురు టీడీపీ కార్యకర్తలు ఆదివారం ఆ పార్టీని వీడి వైఎస్సార్ సీపీలో చేరారు. తుని మండలం ఎస్.అన్నవరం క్యాంపు కార్యాలయంలో వెంకటాపురానికి చెందిన పిల్లి పెదకాపు, పసుపులేటి అప్పన్న, సత్తిబాబు, చంద్రరావు, వెలగా మణికంఠ, పిల్లి శివ, ఆకుల అంజితో పాటు పలువురు వైఎస్సార్ సీపీలో చేరారు. వీరికి రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖమంత్రి దాడిశెట్టి రాజా కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై వైఎస్సార్ సీపీలో చేరామన్నారు. పార్టీ విజయం కోసం పని చేయాలని మంత్రి రాజా సూచించారు. కార్యక్రమంలో నమాల భద్రరావు, అత్తి సూరిబాబు, జి.రమణ, కూనిశెట్టి సత్తిబాబు, దాసరి బాబ్జి, ఆకుల నాని తదితరులు పాల్గొన్నారు.

ముద్రగడ చేరికతో పార్టీ మరింత బలోపేతం



చిల్లంగిలో తోట నరసింహం, రాంజీ సమక్షంలో పార్టీలోకి చేరిన దిడ్డి సుబ్బారావు

వైఎస్సార్ సీపీ జగ్గంపేట ఎమ్మెల్యే అభ్యర్థి తోట నరసింహం

కిర్లంపూడి: సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం వైఎస్సార్ సీపీలో చేరడంతో పార్టీకి మరింత బలం చేకూరిందని ఆ పార్టీ జగ్గంపేట ఎమ్మెల్యే అభ్యర్థి తోట నరసింహం అన్నారు. మండలంలోని చిల్లంగిలో టీడీపీ నాయకులు దిడ్డి సుబ్బారావు, దిడ్డి భద్రంతో పాటు సుమారు 20 కుటుంబాలు తోట నరసింహం, తోట రాంజీ సమక్షంలో ఆదివారం వైఎస్సార్ సీపీలోకి చేరాయి. వారికి తోట నరసింహం కండువాలు వేసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా తోట నరసింహం మాట్లాడుతూ ముద్రగడకు తనపై ఉన్న అభిమానంతో కిర్లంపూడి, జగపతినగరం, చిల్లంగి గ్రామాల్లోని నాయకులతో ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేశారన్నారు. ఆయన నాయకత్వంలో వచ్చే ఎన్నికల్లో జగ్గంపేట నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ మరింత మెజార్టీ సాధిస్తుందన్నారు. రానున్న 20 రోజుల్లో ప్రతి కార్యకర్త శక్తి వంచన లేకుండా పార్టీ విజయానికి కృషి చేయాలన్నారు. జగ్గంపేట ఎమ్మెల్యేగా తనను, కాకినాడ ఎంపీగా చలమలశెట్టి సునీల్‌ను గెలిపించి జగన్‌ను మరోసారి సీఎంను చేయాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పెంటకోట నాగబాబు, ఓలేటి రాజు, అడబాల సుబ్బారాయుడు, అడారి మహేష్, వేగి సాంబశివ, పీలా సబ్బు, దోమాల గంగాధర్, అడారి నానాజీ, శరకణం సంతోష్ పాల్గొన్నారు.

భావితరాల భవిష్యత్‌కు భరోసా జగన్



ఏలూరులో ఎన్నికల ప్రచారం చేస్తున్న వరుపుల సుబ్బారావు

- వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు ఎమ్మెల్యే అభ్యర్థి వరుపుల సుబ్బారావు
- ఏలూరులో ఎన్నికల ప్రచారం

ప్రత్తిపాడు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే భావితరాలకు బంగారు భవిష్యత్తు సాధ్యమని వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి వరుపుల సుబ్బారావు అన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు నిరంతరాయంగా కొనసాగాలంటే జగన్ మళ్లీ ముఖ్యమంత్రి కావాలన్నారు. మండలంలోని ఏలూరులో ఆదివారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పార్టీ నాయకులతో కలిసి ఇంటింటికీ వెళ్లి ఓట్లు అభ్యర్థించారు. గ్రామంలోని ప్రతి ఇంటి తలుపు తట్టి, ప్రభుత్వం నుంచి చేకూరిన లబ్ధిని ప్రజలకు వివరించారు. గత ఐదేళ్లలో ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమాన్ని చూసి వచ్చే ఎన్నికల్లో ఓటువేయాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం కులమతాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తోందన్నారు. మరోసారి జగన్‌మోహన్‌రెడ్డిని ఆశీర్వదించి సీఎం చేసుకుంటే మరిన్ని సంక్షేమ పథకాలు ప్రజలకు అందిస్తారన్నారు. వచ్చే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటేసి, అత్యధిక మెజార్టీతో ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా చలమలశెట్టి సునీల్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ గోళ్ల కాంతి సుధాకర్, జెడ్పీటీసీ సభ్యురాలు బెహరా రాజరాజేశ్వరి, ఎంపీటీసీలు దాడిశెట్టి రాణిచక్రధర్, పిల్లా చిన్నా, వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు బెహరా దొరబాబు, పార్టీ నాయకులు దాడిశెట్టి నూకాపతి, సాయిబాబు, జల్లిగంపల ప్రభాకరరావు, కొట్టేటి రాయుడు, సూరంపూడి నూకరాజు, బి.సత్యానందం, పినిశెట్టి ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

వచ్చే ఎన్నికల్లో విజయం ఖాయం



ఆత్మీయ సమావేశంలో పాల్గొన్న ముద్రగడ పద్మనాభం, తోట నరసింహం

కిర్లంపూడి: వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయం ఖాయమని కాపు ఉద్యమ నేత, వైఎస్సార్ సీపీ నాయకుడు ముద్రగడ పద్మనాభం, వైఎస్సార్ సీపీ జగ్గంపేట ఎమ్మెల్యే అభ్యర్థి తోట నరసింహం అన్నారు. కిర్లంపూడిలోని మాజీ సర్పంచులు పెంటకోట నాగబాబు, కర్రి సూర్యకుమార్, రాపేటి వర్ధనమ్మ, స్థానిక నాయకులు శరకణం భద్రం, రాపేటి పెద్ద, దిడ్డి సుబ్బారావు నివాసాల్లో ఆదివారం ఆత్మీయ సమావేశాలు నిర్వహించారు. ఈ సమావేశాలకు వచ్చిన ప్రతి నాయకుడు, కార్యకర్తను పేరుపేరునా ముద్రగడ పద్మనాభం తోట నరసింహం, యువ నాయకుడు తోట రాంజీలకు పరిచయం చేశారు. కార్యక్రమంలో గణేశుల లచ్చబాబు, మండల పార్టీ అధ్యక్షుడు పెనగంటి రాజేష్, మండల సచివాలయాల కన్వీనర్ జోకా శ్రీను, అడారి సోమేశ్వరరావు, దాడి సూరిబాబు, తూము చినబాబు తదితరులు పాల్గొన్నారు.

కత్తిపూడిలో ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్



కత్తిపూడిలో ఫాగింగ్ చేస్తున్న పంచాయతీ కార్మికులు

శంఖవరం: పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే ప్రజలందరూ ఆరోగ్యంగా ఉంటారని సర్పంచ్ కొల్లు సత్తిబాబు అన్నారు. మండలంలోని కత్తిపూడిలో ఆదివారం ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్ నిర్వహించారు. పంచాయతీ సిబ్బంది రోడ్లకు ఇరువైపులా ఉన్న చెత్త, వ్యర్థాలను తొలగించారు. డ్రైన్లలో పూడిక తీసి బ్లీచింగ్ చల్లారు. వీధుల్లో దోమల నివారణ మందు పిచికారీ చేశారు. వాటర్ ట్యాంక్‌లను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ సత్తిబాబు మాట్లాడుతూ గ్రామం పరిశుభ్రతే లక్ష్యంగా అధికారులు పని చేయాలని సూచించారు.

సంక్షేమ ప్రభుత్వాన్ని మళ్లీ గెలిపించండి



ఎస్.అన్నవరంలో ఎన్నికల ప్రచారం చేస్తున్న దాడిశెట్టి లక్ష్మీచైతన్య, చైర్‌పర్సన్ సుధారాణి, జెడ్పీ వైస్ చైర్మన్ పద్మలత

- మంత్రి, వైఎస్సార్ సీపీ తుని అభ్యర్థి దాడిశెట్టి రాజా సతీమణి లక్ష్మీచైతన్య
- ఎస్.అన్నవరంలో ఎన్నికల ప్రచారం

తుని రూరల్: కులమతాలు, రాజకీయాలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వాన్ని మళ్లీ గెలిపించాలని రోడ్లు, భవనాలశాఖ మంత్రి, వైఎస్సార్ సీపీ తుని ఎమ్మెల్యే అభ్యర్థి దాడిశెట్టి రాజా సతీమణి లక్ష్మీచైతన్య పిలుపునిచ్చారు. మండలంలోని ఎస్.అన్నవరంలో తుని మున్సిపల్ చైర్‌పర్సన్ ఏలూరి సుధారాణి, జిల్లా పరిషత్ వైస్ చైర్‌పర్సన్ మేరుగు పద్మలతతో కలసి ఆదివారం ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత ఐదేళ్లలో మీ కుటుంబాలకు మంచి జరిగితేనే ఓటు వేయండి అన్నారు. రాష్ట్రంలో జగన్, తుని నియోజకవర్గంలో మంత్రి రాజా మహిళల సంక్షేమానికి కృషి చేస్తున్నారన్నారు. ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. మళ్లీ వైఎస్సార్ సీపీ ప్రభుత్వమే వస్తే పథకాలన్నీ కొనసాగుతాయన్నారు. వచ్చే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి మరోసారి ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని, తుని ఎమ్మెల్యేగా దాడిశెట్టి రాజాను గెలిపించాలని కోరారు. మార్కెట్ కమిటీ చైర్మన్ మాకినీడి బాబు, ఏరియా ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు పోతల లక్ష్మణ్, వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు గంటా చక్రరావు, మండల యూత్ కన్వీనర్ కీర్తి బాలకృష్ణ, నాయకులు కుసనం దొరబాబు, శిల్పరశెట్టి జగన్ మోహన్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మహిళల అభ్యున్నతే ధ్యేయం



సూరంపాలెంలో ఎన్నికల ప్రచారం చేస్తున్న తోట వాణి

- వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు అభ్యర్థి తోట నరసింహం సతీమణి వాణి
- సూరంపాలెంలో ఎన్నికల ప్రచారం

గండేపల్లి: మహిళల అభ్యున్నతే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమని వైఎస్సార్ సీపీ జగ్గంపేట ఎమ్మెల్యే అభ్యర్థి తోట నరసింహం సతీమణి వాణి అన్నారు. మండలంలోని సూరంపాలెంలో ఆదివారం తోట వాణి, ఆమె కోడలు శ్రీనిధితో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రజలకు ప్రభుత్వ పథకాలను వివరించారు. రాష్ట్రంలో ప్రస్తుతం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు కొనసాగాలంటే జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావాలన్నారు. వచ్చే ఎన్నికల్లో ప్రతిఒక్కరూ ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి జగ్గంపేట ఎమ్మెల్యేగా తోట నరసింహాన్ని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ చలగళ్ల దొరబాబు, పార్టీ మండల అధ్యక్షుడు మద్దిపట్ల రామకృష్ణ, డీసీఎంఎస్ మాజీ డైరెక్టర్ రామకుర్తి మూర్తి, నాయకంపల్లి, యర్రంపాలెం గ్రామ జేసీఎస్ కన్వీనర్లు మలిరెడ్డి పాపారావు, నిమ్మలపూడి శ్రీహరి, సుబ్బయమ్మపేట సర్పంచ్ బొబ్బర శివ తదితరులు పాల్గొన్నారు.

ఏలేశ్వరంలో అన్నదానం



ఏలేశ్వరంలో భక్తులకు వడ్డిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

ఏలేశ్వరం: శ్రీరామ నవమి ఉత్సవాల ముగింపును పురస్కరించుకొని పట్టణంలో ఆదివారం అన్నదానం నిర్వహించారు. మున్సిపాల్ కౌన్సిలర్ సామంతుల హైమావతి, మాజీ కౌన్సిలర్ సామంతుల సూర్యకుమార్ ఆధ్వర్యంలో స్థానిక సత్యనారాయణ స్వామి ఆలయం వద్ద భారీ అన్నదానం నిర్వహించారు. స్థానిక, పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి అన్నప్రసాదం స్వీకరించారు. వైఎస్సార్ సీపీ నాయకులు పైల విజయ్‌కుమార్, ఇజనగిరి శివప్రసాద్, శిగడం వెంకటేశ్వరరావు, వాగు బలరాం, దాకమర్రి లోవరాజు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

వైఎస్సార్ సీపీకి విశేష స్పందన

- ఆ పార్టీ జగ్గంపేట ఎమ్మెల్యే అభ్యర్థి తోట నరసింహం తనయుడు రాంజీ
- చిల్లంగిలో ఎన్నికల ప్రచారం



చిల్లంగిలో పార్టీలో చేరిన వారికి కండువాలు వేస్తున్న తోట రాంజీ

కిర్లంపూడి: ఎన్నికల ప్రచారానికి వెళ్లిన ప్రతి గ్రామంలోనూ వైఎస్సార్ సీపీకి ప్రజల నుంచి అపూర్వ స్పందన వస్తోందని ఆ పార్టీ జగ్గంపేట ఎమ్మెల్యే అభ్యర్థి తోట నరసింహం తనయుడు తోట రాంజీ అన్నారు. మండలంలో చిల్లంగిలో ఆదివారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులతో కలిసి ఇంటింటికీ వెళ్లి సీఎం జగన్ చేసిన అభివృద్ధి, సంక్షేమాన్ని వివరిస్తూ ప్రజలకు కరపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా రాంజీ మాట్లాడుతూ గత ఐదేళ్లలో మీ కుటుంబానికి మేలు చేస్తేనే ఓటు వేయండి అని ధైర్యంగా చెబుతున్న ఏకైక నాయకుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. వచ్చే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి జగ్గంపేట ఎమ్మెల్యేగా తోట నరసింహాన్ని, కాకినాడ ఎంపీగా చలమలశెట్టి సునీల్‌ను గెలిపించాలని కోరారు. అనంతరం రాంజీ సమక్షంలో ఎస్సీపేటకు చెందిన పలువురు వైఎస్సార్ సీపీలో చేరారు. కార్యక్రమంలో మాజీ సర్పంచులు పెంటకోట నాగబాబు, మక్కా లక్ష్మీపార్వతి, మండల సచివాలయాల కన్వీనర్ జోకా శ్రీను, మకా విజయకుమార్, గుబ్బల కుమారి, మాకా నాగేశ్వరరావు, మాకా వెంకటేశ్వరరావు, సంఘన వెంకటేశ్వరరావు, మాజీ ఎంపీటీసీ గుడిసె నూకరత్నం, దడాల ప్రభాకరరావు తదితరులు పాల్గొన్నారు.

రుణ వసూళ్లకు రైతులపై ఒత్తిడి తేవొద్దు

బీకేఎస్ రాష్ట్ర కార్యదర్శి శ్రీకాంత్

ప్రత్తిపాడు: బ్యాంకుల నుంచి తీసుకున్న రుణాలు చెల్లించమంటూ రైతాంగాన్ని ఒత్తిడికి గురిచేయవద్దని భారతీయ కిసాన్ సంఘ్ (బీకేఎస్) రాష్ట్ర కార్యదర్శి కె.శ్రీకాంత్ కోరారు. ప్రత్తిపాడు మునసబు గారి రామాలయ ఆవరణలో ఆదివారం సాయంత్రం బీకేఎస్ కాకినాడ జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ వ్యవసాయ పెట్టుబడుల నిమిత్తం రైతులు బ్యాంకుల నుంచి పొందిన రుణాలను తక్షణమే చెల్లించాలని, లేకుంటే బకాయిలు చెల్లించని రైతుల అస్తులను వేలం వేస్తామంటూ బ్యాంకు అధికారులు హుక్కుం జారీ చేస్తున్నారని తెలిపారు. అలాంటి పరిస్థితి ఎదురైతే రైతులకు ఆత్మహత్యలే శరణ్యమని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాగైతే రైతు పంట పండించేదెలా ? అని ప్రశ్నించారు. కొంత మంది ఐపీ పెట్టడం వల్ల ప్రైవేటు అప్పులు పుట్టక, బంధువులు, తెలిసిన వారి వద్ద నుంచి తెచ్చిన విలువైన వస్తువులు బ్యాంకుల్లో తాకట్టుపెట్టి సాగు చేస్తే గత డిసెంబర్ నెలలో వచ్చిన తుపాన్‌కు రైతులు పంట నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. రెండో పంటలోనైనా ఆశించిన రీతిలో దిగుబడులు వస్తాయని రైతాంగం ఎదురుచూస్తోందన్నారు. పంట చేతికి రాకుండానే బకాయిలు చెల్లించమంటూ బ్యాంకు అధికారులు ఒత్తిడి చేయడం దారుణమని వాపోయారు. పంట చేతికి అందేవరకూ బకాయిల చెల్లింపునకు గడువు ఇవ్వాలంటూ బీకేఎస్ జిల్లా కార్యదర్శి కె శ్రీకాంత్ కోరారు. రైతులు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై బీకేఎస్ ప్రతినిధులు ప్రసంగించారు. బీకేఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాసంశెట్టి రాజా అధ్యక్షతన జరిగిన ఈ సభలో బీకేఎస్ ప్రతినిధులు భేరి రాము, ఎ.సురేఖ, శింగిలిదేవి సత్తిరాజు, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

జగన్ మళ్లీ సీఎం కావాలని బైక్ యాత్ర



మోటారు సైకిల్ యాత్ర చేస్తున్న సన్యాసిరావును అభినందిస్తున్న మంత్రి రాజా

తుని: సంక్షేమ ప్రదాత, జననేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావాలని శ్రీకాకుళం జిల్లా గార మండలం అంపోలుకు చెందిన గొర్లి సన్యాసిరావు మోటారు సైకిల్ యాత్ర చేపట్టడం అభినందనీయమని రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజా అన్నారు. మోటార్ సైకిల్ యాత్ర చేస్తున్న సన్యాసిరావు తుని మండలం ఎస్.అన్నవరం క్యాంపు కార్యాలయానికి ఆదివారం చేరుకుని మంత్రి రాజాను మర్యాదపూర్వకంగా కలిశారు. వైఎస్సార్ సీపీ శ్రేణులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ సీఎం కావాలని కోరుతూ 40 రోజులుగా యాత్ర చేస్తున్నట్టు సన్యాసిరావు తెలిపారు. ఇందుకు రూ.4.50 లక్షలతో బైక్ కొనుగోలు చేసి రాష్ట్ర వ్యాప్తంగా యాత్ర చేస్తూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చేసిన సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తున్నట్టు చెప్పారు. మోటారు సైకిల్‌కు సైతం వైఎస్సార్ సీపీ రంగులు వేసి రాష్ట్రంలోని 175 నియోజకవర్గాల్లో పర్యటిస్తున్నానన్నారు. జననేత కోసం యాత్ర చేస్తున్న సన్యాసిరావును మంత్రి రాజా కొనియాడారు. పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు అభినందించారు.

వరివడిగా మాసూళ్లు

తొండంగి: మండలంలోని రబీ వరి మాసూళ్లు జోరుగా సాగుతున్నాయి. మండల వ్యాప్తంగా తొండంగి, ఎ.కొత్తపల్లి, కోదాడ, సీతారాంపురం, కొమ్మనాపల్లి, బెండపూడి తదితర ప్రాంతాల్లో దాదాపుగా 6 వేల ఎకరాల్లో ఈ ఏడాది రబీ వరి సాగు చేశారు. నాట్లు ముందుగా వేసిన చోట ఇప్పటికే రైతులు పంటను ఒబ్బిడి చేసుకున్నారు. పలు గ్రామాల్లో నూర్పిడులు, గింజల ఆరబోత పనులు జరుగుతున్నాయి. మండలంలో ఇప్పటికే 90 శాతం మాసూళ్లు పూర్తయినట్టు అధికారులు తెలిపారు. ఆలస్యంగా వరినాట్లు వేసిన ప్రాంతాల్లో పంట కోత కోయాల్సి ఉందన్నారు. గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినట్టు మండల వ్యవసాయశాఖాధికారి ఎస్.నరసింహం తెలిపారు. రైతులు ఆర్‌బీకేల ద్వారా పంటను విక్రయించుకోవాలని సూచించారు.

నాడు అవస్థల మయం - నేడు అభయం

ప్రత్తిపాడు రూరల్: ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం మండలంలోని ఒమ్మంగి - శరభవరం రోడ్డును నిర్మించింది. రూ.1.60 కోట్లతో ఒమ్మంగి రాజ్ చెరువు నుంచి శరభవరం సమీపంలోని జీడిపిక్కల ఫ్యాక్టరీ వరకూ ఆర్అండ్‌బీ రహదారిని పునర్నిర్మించారు. గత ప్రభుత్వ హయాంలో ఈ రహదారి పూర్తిగా శిథిలావస్థకు చేరుకున్నప్పటికీ పట్టించుకొన్న దాఖలాలు లేవు. వర్షం వస్తే అడుగు తీసి అడుగు వేయలేని పరిస్థితి ఉండేది. ఫలితంగా ఈ రహదారిపై ప్రయాణించేందుకు ప్రజలు నరకం చూసేవారు. ఎట్టకేలకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈ రహదారికి మోక్షం కలిగింది. రహదారిని పునర్నిర్మించడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



నాడు: అధ్వానంగా ఉన్న ఒమ్మంగి - శరభవరం రోడ్డు



నేడు: రూ.1.60 కోట్లతో నిర్మించిన ఒమ్మంగి-శరభవరం రహదారి